క్లుప్తంగా

ఆలయ గోపుర నిర్మాణానికి విరాళం


గ్రామపెద్దలకు నగదును అందజేస్తున్న మహేంద్రగౌడ్

హొళగుంద: మండలంలోని పెద్దగోనెహాళ్ గ్రామంలో వెలిసిన గంగమ్మ దేవి ఆలయ గోపుర నిర్మాణానికి ప్రముఖ పారిశ్రామికవేత్త ఆర్.రాజాగౌడ్ బుధవారం రూ. 25 వేలు విరాళంగా ఇచ్చారు. గ్రామపెద్దలు వెంకట్రాముడు, గోపాల్, మంగన్న పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ఆస్పరి: మండలంలోని బిల్లేకల్లు గ్రామంలో ఈనెల 20న విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధమై నష్టపోయిన బాధితుడు ఉచ్చీరప్ప కుటుంబానికి సీపీఐ, బండమీద వెంకటేశ్వర్లు సేవా సమితి తరపున బుధవారం రూ.10వేలు సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య అందజేశారు. నాయకులు నాగేంద్రయ్య, విరుపాక్షి, లక్ష్మన్న, రమేష్ పాల్గొన్నారు.

రమణీయం.. రథోత్సవం


రథోత్సవం జరుగుతున్న దృశ్యం

హొళగుంద: మండల కేంద్రంలో వెలిసిన దేవమ్మ దేవి రథోత్సవ బుధవారం రాత్రి రమణీయంగా జరిగింది. రథోత్సవంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మహా శివరాత్రిని పురస్కరించుకుని జరిగిన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 21న కంకణధారణ, 24, 25 తేదీల్లోలో ఉచ్చాయోత్సవాలు జరిపినట్లు సభ్యులు వెల్లడించారు.

8 వారాలుగా అందని వేతనాలు


బంటనాహాలులో ఉపాధి పని చేస్తున్న కూలీలు

చిప్పగిరి: ఉపాధి హామీ పథకం పనులు చేసిన కూలీలకు 8 వారాలు గడుస్తున్నా వేతనాలు అందక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. కనీసం మహాశివరాత్రి పండుగ పూట కూడా కూలి సొమ్ము అందక పోవడంతో పల్లె ప్రజల ముఖాల్లో ఆనందం కనిపించడం లేదు. మండలంలో ఉన్న 13 గ్రామ పంచాయతీల్లో మొత్తం 7,202 జాబ్ కార్డులు ఉన్నాయి.అందులో సమారు 14,114 మంది వరకు కూలీలు ఉన్నారు. వీరందరికీ ఎనిమిది వారాలుగా వేతనాలు అందక కుటుంబాలు గడవక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా కూలి మంజూరు చేయాలని కోరుతున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం


పట్టుబడిన మద్యం బాక్స్‌లు, బైక్ చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

కృష్ణగిరి: కోడుమూరు ఎక్సైజ్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించి కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ మంజుల మాట్లాడుతూ.. పర్యవేక్షణలో తెల్లవారుజామున దాడులు నిర్వహించగా కృష్ణగిరి సమీపంలోని క్వారీ వద్ద బండి లోకేష్ నుంచి 40 బాక్స్‌ల ఒరిజినల్ ఛాయిస్ విస్కీ (3,840 టెట్రా ప్యాకెట్ల)ను, ప్యాషన్ ప్రో మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు ఆమె తెలిపారు. అలాగే కర్ణాటక మద్యాన్ని సరాఫరా చేసిన రాజేంద్రపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ రూ. 1,60,000 ఉంటుందన్నారు. దాడుల్లో ఎస్ఐ చంద్రమోహన్, లక్ష్మి, హెడ్ కానిస్టేబుళ్లు జగన్నాథం, పీరా, తిరుపాలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

విద్యుత్ వృథా..


చిప్పగిరిలో పగటి పూట వెలుగుతున్న విద్యుత్ దీపాలు

చిప్పగిరి: మండలంలోని పలు గ్రామల్లో విద్యుత్ దీపాలు పగటి పూట కూడా వెలగుతూ విద్యుత్ వృథా కావడం మండలంలో సర్వసాధారణమైంది. పలు గ్రామాల్లో విద్యుత్ దీపాలు లేక చీకటిలో మగ్గుతుంటే విద్యుత్ వృథా చేస్తుండడంపై పంచాయతీలపై అదనపు భారం పడుతుంది. అధికారులు స్పందించి సమాయానుకూలంగా విద్యుత్ దీపాలు అర్పివేయాలని ప్రజలు కోరుతున్నారు.


పూజలందుకుంటున్న ఉమామహేశ్వరస్వామి


ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వరస్వామి


ఆలూరులో భీమలింగేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న జడ్జి హేమ


పూజలందుకున్న బ్రహ్మసూత్ర శివలింగం


బ్రహ్మగుండంలో కల్యాణం నిర్వహిస్తున్న పండితులు


రామతీర్థంలో పూజలందుకున్న రామలింగేశ్వర స్వామి

హరహర మహాదేవ..శంభో శంకర

- భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి
- భక్తులతో కిక్కిరిసిన శైవాలయాలు
- మహాశివుడికి విశేష పూజలు

తుగ్గలి : శివరాత్రి పర్వదినాన్ని బుధవారం మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. హర హర మహాదేవ..శంభో శంకర అంటూ స్వామివారిని స్మరిస్తూ భక్తులు ఉపవాస దీక్షతో పూజలు చేశారు. ముక్కెల్లలో శివాలయాలన్నీ పూలతో అలంకరించి స్వామికి పూజలు చేశారు. గిరిగెట్లలో రాత్రి నందికోల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బోడబండ పుణ్యక్షేత్రంలో కొలువైన రామలింగేశ్వర స్వామిని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున వచ్చిన భక్తులు దర్శించుకొని పూజలు చేశారు. రాత్రంతా కొండపై జాగరణ చేశారు.

ఉత్సవాలు ప్రారంభం..

బోడబండ పుణ్యక్షేత్రంలో వెలసిన తిమ్మగురుడు, పక్కీరప్పస్వాముల ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్తలు సుదర్శనరెడ్డి, వేణు, ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పక్కీరప్ప స్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. గురువారం స్వాముల రథోత్సవాలు వేర్వేరుగా నిర్వహించనున్నారు. సర్పంచ్‌లు ప్రభాకరరెడ్డి, బాలమ్మ, శంకరమ్మ, ఎంపీటీసీ సభ్యుడు రామదాస్ నాయక్, ఆలయ నిర్వాహకులు కనికిరెడ్డి సోదరులు, అప్పా సోదరులు, రామలింగేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త రాఘవరెడ్డి, ఆలయ నిర్వాహకులు కృష్ణయ్య ఆచారి పాల్గొన్నారు.

శివనామస్మరణతో మారుమోగిన శైవ క్షేత్రాలు..

ఆస్పరి: మహా శివరాత్రి సందర్భంగా బుధవారం మండలంలోని శైవ క్షేత్రాలు శివనామస్మరణతో మారుమోగాయి. ఆస్పరిలోని మూల ఈశ్వరస్వామి, తిమ్మగురుడు పక్కీరప్ప తాత, రామతీర్థంలోని రామలింగేశ్వరస్వామి, జ్యోతిర్లింగాలు, అమరనాథ్ లింగం, బిణిగేరిలో శ్రీగిరి పంచలింగేశ్వర స్వామి, కైరుప్పల్లోని వీరభద్రస్వామి, మహాలింగప్ప ఆలయాల్లో గంగ, ఆకుపూజ, పంచామృతాభిషేకం, మహా మంగళ హారతి తదితర కార్యక్రమాలు చేపట్టారు. బిణిగేరి కొండల్లో వెలసిన శ్రీగిరి పంచలింగేశ్వర స్వామి ఆలయంలో నిర్వాహకులు శ్రీనివాసులు నాయన ఆధ్వర్యంలో హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామతీర్థంలోని


బోడబండలో పూజలందుకున్న రామలింగేశ్వరుడు

రామలింగేశ్వర స్వామి ప్రభోత్సవాన్ని ఆలయం నుంచి ఆదోని రోడ్డు వరకు నిర్వహించారు.

నేడు పక్కీరప్పతాత రథోత్సవం..

మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆస్పరి సమీపంలోని పక్కీరప్ప తాత రథోత్సవం గురువారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తిమ్మప్ప స్వామి తెలిపారు. ఆలయంలో కొలువైన తిమ్మగురుడు స్వామికి గంగ, ఆకుపూజ, మహా మంగళహారతులు, కుంభాల ఊరేగింపు, గొరవయ్యల నృత్యం తదితర కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.

కృష్ణగిరి: మహా శివరాత్రి వేడుకలను బుధవారం ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. శైవాలయాల్లో ఈశ్వర నాదం ప్రతిధ్వనించింది. మహిళలు ఉపవాస దీక్ష చేబూని శివుడికి ఇష్టమైన పాయాసం, గుగ్గిళ్లు, బెల్లం పానకం తయారుచేసి నైవేద్యంగా సమర్పించారు. చుంచుఎర్రగుడి గ్రామంలోని రామప్ప దేవాలయంలో రామలింగేశ్వరస్వామి, పార్వతీదేవిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. భక్తులకు గ్రామస్తులు అన్నప్రసాదం పంపిణీ చేశారు. లక్కసాగరం గ్రామంలో ఉమామహేశ్వరస్వామి తిరునాల ప్రారంభమైంది. రాత్రి నందికోల సేవ నిర్వహించారు.

కమనీయం.. బ్రహ్మేశ్వరుని కల్యాణం

వెల్దుర్తి: పట్టణ సమీపంలోని బ్రహ్మగుండం క్షేత్రంలో బుధవారం జాగరణతో శివరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచే పోటెత్తిన భక్తులతో బ్రహ్మాండోత్సవంగా సాగాయి. చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ టి హనుమంతరావ్, ఈఓ ఆంజనేయులు, నిర్వాహకుడు బొమ్మన రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో భక్తులు, ప్రముఖులు కామేశ్వరీదేవి సమేత బ్రహ్మేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.


బ్రహ్మగుండంలో నిర్వహించిన కల్యాణానికి హాజరైన భక్తులు

నేడు కల్యాణం..

చుంచుఎర్రగుడిలో గురువారం ఉదయం స్వామి, అమ్మవార్ల కల్యాణంతో పాటు పల్లకీ ఊరేగింపు చేపడుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. అలాగే మధ్యాహ్నం రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు ఏర్పాటు చేశారు. అలాగే లక్కసాగరం గ్రామంలో ఉమామహేశ్వరస్వామి కల్యాణం, అనంతరం ప్రభోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు. సాయంత్రం రథోత్సవం అనంతరం పల్లకీ సేవా ఉంటుందని వివరించారు.

మద్దికెర : మండలంలోని గ్రామాల్లో మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని బుధవారం ఈశ్వర దేవాలయాలు శివనామస్మరణతో మారుమోగాయి. మద్దికెరలోని విరుపాక్ష దేవాలయం, కొండమ్మ బావి శివాలయం, నగరేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ పరమేశ్వర ఉత్సవ మూర్తులను అలంకరించి కల్యాణమండపంలో కొలువుంచారు. వేదమంత్రోచ్చారణల మధ్య పండితులు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. కాగా.. బుగ్గ సంగమేశ్వర దేవాలయం, ఎం.అగ్రహారం గ్రామంలోని కొండప్ప స్వామి రథోత్సవాన్ని గురువారం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.


శివలింగానికి పాలాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి

హాలహర్వి: మండలలంలో బుధవారం శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విరుపాపురం గ్రామంలోని బల్గోట బసవేశ్వరస్వామి, బాపురం బసవేశ్వర, నిట్రవట్టిలోని శివుడు, బసవేశ్వర ఆలయాల్లో విగ్రహాలకు భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

హొళగుంద: మండలంలో మహాశివరాత్రి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. దేవరగట్టు మాళమల్లేశ్వరస్వామి సన్నిదానంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. హొళగుంద సిద్దేశ్వరస్వామి, సిద్దనగౌడ్ తాతా, దక్షిణమూర్తి, భోగేశ్వరస్వామి, వీరభద్రేశ్వర స్వామి ఆలయాలతో పాటు పల్లెల్లో భక్తులు ఆలయాలకు వెళ్లి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. హొళగుందలోని పెద్దకొండలో వెలసిన మ్యాగల సిద్దప్పకు కాలినడకన వెళ్లి పూజలు నిర్వహించిన భక్తులు అక్కడ గండ దీపాన్ని వెలిగించారు.

ఆలూరు రూరల్: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివాలయాలు శివనామస్మరణంతో మార్మోగాయి. మహాశివరాత్రి సందర్భంగా బుధవారం ఉదయం నుంచి భక్తులు ఆయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. మొలగవల్లి గ్రామంలో కొలువైన నానేపాటయ్య స్వామి గ్రామోత్సవంలో గ్రామ మహిళలు, చిన్నారులు వంద కలశాలతో ఊరేగించారు. తుంబళబీడు గ్రామంలోని భోగలింగేశ్వర స్వామి, మూసానహళ్లి గ్రామంలోని సోమలింగేశ్వర దేవాలయంలో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం రాత్రి ఆలూరు భీమలింగేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణోత్సవం చేసి.. లింగోద్భవ సమయంలో రుద్రాభిషేకం జరిపించారు.

దేవనకొండ: మండలంలో బుధవారం శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా శివాలయాలకు భక్తులు వెళ్లి శివపార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పి.కోటకొండ గ్రామంలోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ పరమేశ్వర్లకు అభిషేకాలు చేపట్టారు.


పి.కోటకొండలో మెట్ల పూజలో పాల్గొన్న శివ మాలధారులు


బుగ్గలో కల్యాణోత్సవం అనంతరం ఉత్సవమూర్తులు


బ్రహ్మగుండంలో జడ్జి టి.మల్లేశ్వరికి స్వామి వారి ప్రసాదాన్ని అందిస్తున్న అర్చకులు


బిలేహాల్‌లో పూజలందుకున్న శివుడు


మొలగవల్లిలో నానేపాటయ్య స్వామి గ్రామోత్సవంలో కలశాలతో పాల్గొన్న చిన్నారులు


విశేష అలంకరణలో మాళమల్లేశ్వరస్వామి


బ్రహ్మగుండంలో స్వామి, అమ్మవార్ల దర్శనార్థం క్యూలో వేచిఉన్న భక్తులు

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

హాలహర్వి: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వీఆర్‌పీఎస్ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు, మండల కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. బుధవారం స్థానిక వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తామని హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబునాయుడు, ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను విస్మరించారని మండిపడ్డారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ మార్చి 3న కర్నూలు కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కృష్ణమూర్తి, రంగయ్య పాల్గొన్నారు.

ఘనంగా రేవణ సిద్ధేశ్వరస్వామి రథోత్సవం

మద్దికెర : స్థానిక రేవణ సిద్ధేశ్వరస్వామి వారి రథోత్సవం గురులింగ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకం, మహామంగళహారతి తదితర కార్యక్రమాలు చేపట్టి పూజలకు విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తిని రథంపై అధిష్టింపజేసి ప్రధాన కూడలిలో రథోత్సవం నిర్వహించారు.


రథోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

ఆశల రుణాలు అర్హులకు అందేనా!

- అరకొరగా సబ్సిడీ రుణాల కేటాయింపు
- భారీగా ఆశావహుల దరఖాస్తు
- తమ వారికి పంచేందుకు కూటమి నేతల యత్నాలు
- సామాన్యుల్లో సన్నగిల్లుతున్న ఆశలు
- నియోజకవర్గంలో 312 యూనిట్లకు 4,073 దరఖాస్తులు

ఆలూరు రూరల్: ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు లేవు. పని చేసుకుందామంటే పరిశ్రమలు లేవు. చిన్నపాటి వ్యాపారంతో స్వయం ఉపాధి పొందుదామంటే ఆర్థిక స్తోమత లేదు. ఈ నేపథ్యంలో బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరయ్యాయని తెలిసి సామాన్యులు సంతోషం వ్యక్తం చేసి వందల రూపాయలు ఖర్చుపెట్టి దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఈ ఆశల సబ్సిడీ రుణాలు వారికి అందడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

అరకొరగా రుణాలు..

బీసీ కార్పొరేషన్ నుంచి పదుల సంఖ్యలో యూనిట్లు మంజూరైనా దరఖాస్తులు మాత్రం వందల్లో వచ్చాయి. దీంతో చాలా మంది దరఖాస్తుదారులు రుణాలు ఇప్పించాలని స్థానికంగా ఉండే టీడీపీ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. యూనిట్లు కేటాయింపు జరిగిన రోజు నుంచే సబ్సిడీ రుణాలపై రాజకీయ జోక్యం పెరగడంతో అన్ని అర్హతలు ఉన్న సామాన్యులు ఆశలు వదులుకోవాల్సిన పరిస్థితి.


ఆలూరులో బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తుదారులను ఇంటర్వ్యూ చేస్తున్న అధికారులు (ఫైల్)

312 యూనిట్లకు 4,073 దరఖాస్తులు

ఆలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాలకు కేవలం 312 యూనిట్లు మాత్రమే కేటాయించారు. వీటిలో బీసీలు,కాపు, ఈబీసీలను కేటగిరీలుగా విభజించారు. ఈ రుణాల కోసం 4,073 మంది దరఖాస్తు చేసుకున్నారు. దీంతో నియోజకవర్గంలో అన్ని గ్రామాల ప్రజలకు కనీసం ఒకటి చొప్పునైనా మంజూరయ్యే అవకాశం లేదని పలువురు విమర్శిస్తున్నారు. నామమాత్రంగా యూనిట్లు కేటాయించడంపై నిరుద్యోగ యువత, ఆశావాహులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. యూనిట్ విలువ రూ.2 లక్షల నుంచి 5 లక్షల వరకు ఉన్నాయి. వీటిని దక్కించుకునేందుకు అధికార పార్టీకి చెందిన కార్యకర్తలు పలుకుబడి ఉన్న నేతల చుట్టూ కాళ్లు అరిగేలా ప్రదక్షిణలు చేస్తున్నారు.

కార్యకర్తలకే పంచిపెట్టే యత్నం..

ప్రభుత్వం మంజూరు చేసిన సబ్సిడీ యూనిట్లు అంతంత మాత్రంగానే ఉండటం, ప్రతి మండలంలో దరఖాస్తులు వందల్లో రావడంతో తీవ్ర పోటీ నెలకొంది. అధికార పార్టీ కార్యకర్తలు, నాయకుల మధ్యే తీవ్ర పోటీ నెలకొనడంతో సామాన్యులు నిరాశ చెందుతున్నారు. ఆ పార్టీ నేతలు వారి అనుచరులకే పంచి పెట్టే యత్నం చేస్తున్నట్లు తెలిసింది. వారిని దాటుకుని తమకు రుణాలు మంజూరు అసాధ్యమని నిర్ణయించుకున్నారు. ఉన్నత చదువులు అభ్యసించి ఖాళీగా ఉన్న యువతకు ప్రాముఖ్యత ఇచ్చి స్వయం ఉపాధి పొందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. అయితే ఇప్పటికే ఫలానా వారికే రుణాలు కేటాయించాలని ఆయా మండలాల అధికారులకు కూటమి నాయకలు మౌఖికంగా ఆదేశించినట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు నిర్వహించిన ఇంటర్వ్యూల తీరు చూస్తే దరఖాస్తుల పరిశీలన పేరుకే అన్నట్లు ఉందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మండలాల వారీగా మంజూరైన యూనిట్లు, దరఖాస్తులు..

మండలం	మంజూరైన యూనిట్లు	వచ్చిన దరఖాస్తులు
ఆలూరు	70	691
ఆస్పరి	59	569
చిప్పగిరి	53	460
హాలహర్వి	50	489
హొళగుంద	50	423
దేవనకొండ	30	1,461

అర్హతల మేరకు రుణాల మంజూరు



సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి చేశాం. పరిశీలన అనంతరం అర్హులైన వారిని బ్యాంకర్లతో కలిసి ఎంపిక చేస్తాం. ఇందు కోసం ప్రత్యేకంగా కమిటీలు ఏమీ లేవు. అర్హతల మేరకే రుణాలు మంజూరు చేస్తాం. సిఫార్సులకు ప్రాధాన్యం లేదు. రుణాల మంజూరులో అనుమానాలు అక్కర్లేదు.

– మహబూబ్ బాషా ఎంపీడీఓ,ఆలూరు

బువ్వ కోసం బొమ్మలా..


బోడబండ తిరునాలలో బొమ్మలా నిల్చున్న బాలుడు

తుగ్గలి : అందమైన బాల్యం పేదరికం నీడలో కరిగిపోతుంది. ఎవరేం చేసినా.. జానెడు పొట్ట నింపుకోవడం కోసమే. తిరునాల సందర్భంగా బుధవారం బోడబండలో ఓ బాలుడు ఒంటి నిండా రంగు పూసుకొని ఆలయం ప్రాంగణంలో కదలకుండా బొమ్మలా నిలబడి ఇలా కనింపించాడు. ఉత్సవాలకు వచ్చిన వారు తమకు తోచిన సాయం చేశారు.